విశాఖపట్టణం
ఆదివారం 4 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 233 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఆసియా క్రీడల్లో... భారత్‌కు పతకాల పంట

21 స్వర్ణాలు సహా 85 పతకాలు

4వ స్థానంలో నిలిచిన భారత్

చివరిరోజూ భారత్‌కు పథకాల పంట

ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు

3



## బాబుది కపట నాటకం

రాయలసీమకు లక్ష కోట్లు అంకెల గారడీ

పబ్లిసిటీ కోసం రైతులకు దగా

పంటలకు మద్దతు ధర లేక రైతుల ఆందోళన

పంట భీమా, సున్నా వడ్డీ స్కీమ్ లను ఎత్తివేసారు

చంద్రబాబుపై మాజీ సీఎం జగన్ ధ్వజం

(తాడేపల్లి - జయజయహే)

రాయలసీమలో ఉద్యానవన రంగానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెస్తున్నామంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంకెల గారడీ చేస్తున్నారని, ఇది కేవలం నాటకమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. శనివారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ఇ) లో ప్రభుత్వంపై ఆయన విరుచుకుపడ్డారు. బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకుండా, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా రూ.లక్ష కోట్ల పెట్టుబడులంటూ ప్రచారం చేసుకోవడం రైతులను దగా చేయడమేనని జగన్ పేర్కొన్నారు. గడిచిన రెండున్నరేళ్ల కాలంలో ఈ ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమ కేవలం మాటలు, పబ్లిసిటీకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. పంటలకు మద్దతు

# ఫిబ్రవరి 3న క్వాంటమ్ కంప్యూటర్ ఆవిష్కరణ

ఐటీ నిపుణుల్లో 35 శాతం భారతీయులే

ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రా

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

పాన్ ఐఐటీ సమ్మిట్‌లో స్టార్టప్‌లో పరిశీలన






(అమరావతి - జయజయహే)

టెక్నాలజీ ఆవిష్కరణలకు ఏపీని హబ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరుగుతున్న పాన్ ఐఐటీ సమ్మిట్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను పరిశీలించిన సీఎం ఆక్సి ఏరోస్పేస్ రూపొందించిన డ్రోన్‌ను పరిశీలించి, సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు దానిపై సంతకం చేశారు. పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలను గంటల్లోనే ఈవీలుగా మార్చే సాంకేతికతపై వివరాలు తెలుసుకుని, ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖాన్ని స్కాన్ చేసి నిమిషాల్లో ప్రాథమిక ఆరోగ్య నివేదిక అందించే యాప్‌పైనా ఆరా తీశారు. స్వర్ణాంధ్ర-10 సూత్రాల అమలులో టెక్నాలజీ వినియోగంపై చిన్నారులు ఇచ్చిన ..మిగతా 2లో

# ప్రపంచానికి ఆంధ్ర మోడల్

అన్ని రంగాల్లో అగ్రగామిగా రాష్ట్రం

ఆవిష్కరణలు, సాంకేతికతకు ఊతం

మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటన

(అమరావతి - జయజయహే)

ప్రపంచానికి భారత్ మోడల్‌ను చూపిద్దామని అది అమరావతి నుంచే వస్తుందని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అన్నారు. ఆ సామర్థ్యం మనకు ఉందనే విషయాన్ని ప్రపంచంతో పాటు దేశంలోని యువతకూ చెబుదామని లోకేశ్ తెలిపారు. ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ఊతమిచ్చేలా విజయవాడలో నిర్వహించిన పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సదస్సును ఆయన ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో పాన్ ఐఐటీయన్స్, ఐఐటీ డైరెక్టర్లు, కార్పొరేట్ సీఈవోలు, యూనికార్న్ సంస్థల వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఐటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 23 క్లస్టర్స్‌లో అభివృద్ధి చెందిన దేశాలుగా అవతరించడానికి అమెరికా, యూరప్‌లకు వందేళ్లు పట్టిందని లోకేశ్ తెలిపారు. దుబాయ్ 30 ఏళ్లు, సింగపూర్ 25 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. వచ్చే పదేళ్లలో భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుందన్నారు. ఆ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ ..మిగతా 2లో



పెండింగ్ చలానా ఉంటే

## లైసెన్స్ రద్దు.. సీజ్

డిజిటల్, ఆన్ లైన్ సేవలు తక్షణ నిలుపుదల

పరివాహన్ పోర్టల్ బ్లాక్ లిస్టులో పెట్టాలి

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

(ప్రత్యేకప్రతినిధి - జయజయహే)




ట్రాఫిక్ చలానాలను తేలిగ్గా తీసుకునే వాహనదారులకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. బకాయి ఉన్న ఈ-చలానాలను చెల్లించకపోతే వాహనాలకు సంబంధించిన పలు డిజిటల్, ఆన్‌లైన్ సేవలను తక్షణమే స్తంభింపజేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలను కేంద్ర ప్రభుత్వ 'పరివాహన్' పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, ..మిగతా 2లో




పండుగకు ముందే

## బాదుడు

పెట్రో, డీజిల్ ధరల షాక్

పెట్రోల్ పై రూ. 5, డీజిల్ పై రూ. 3 పెంపు

ప్రైవేటు ఇంధన సంస్థ నయారా వాత

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వాహనదారులకు షాకింగ్ న్యూస్. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ప్రైవేట్ ఇంధన సంస్థ నయారా ఎనర్జీ ఇంధన ధరలను ఒక్కసారిగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 7వేలకుపైగా పెట్రోల్ పంప్‌లు ఈ సంస్థ నిర్వహిస్తుండగా.. అన్ని రిటైల్ అవుట్ లెట్లలోనూ పెంచుతున్నట్లు ప్రకటించింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి ..మిగతా 2లో

## బీసీలపై పొలిటికల్ గేమ్..!

ఎన్నికల ప్రతీసారి ఇదే రాజకీయం

రాజ్యాంగ పరిమితులు దాటి హామీలు

తర్వాత కోర్టులు చుట్టూ ప్రదక్షిణలు




(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా ..మిగతా 2లో

## నవంబర్ 1 నుంచి కొత్త పెన్షన్ విధానం

కేంద్రం వాటా నేరుగా బ్యాంక్ ఖాతాలోకి జమ

రాష్ట్ర ప్రభుత్వ వాటా చేతికి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పింఛన్ దారులకు అలర్ట్. నవంబర్ 1వ నుండి కొత్త పంపిణీ విధానం అమల్లోకి రానుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై కేంద్ర ప్రభుత్వ వాటా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుండగా.. రాష్ట్ర ప్రభుత్వం అందించే వాటాను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ విధానం నవంబర్ 1 నుంచి అమల్లోకి తీసుకకురానున్నట్లు మంత్రి ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహో

# బీసీలపై పొలిటికల్ గేమ్..!







మొదటి పేజీ తరువాయి...

వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది. రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది.

**ప్రతీ సారి స్థానిక ఎన్నికలప్పుడు బీసీ రిజర్వేషన్ల రాజకీయం**

ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది.

**ట్రిపుల్ టెస్ట్ పూర్తి చేయాలి!**

వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్టంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.




## పండుగకు ముందే
# బాదుడు

మొదటి పేజీ తరువాయి...

వస్తాయని వెల్లడించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.5 పెంచగా.. డీజిల్‌పై రూ.3 పెంచుతున్నట్లు తన ప్రకటనలో వెల్లడించింది. శనివారం నుంచే ఈ ధరలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో తమ మార్జిన్లపై ఒత్తిడి పడుతుందని, అందుకే పెంచాల్సి వస్తోందని నయారా ఎనర్జీ పేర్కొంది. దేశంలోనే అతి పెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ సంస్థగా నయారా ఎనర్జీ ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా-ఇరాన్ ఘర్షణల క్రమంలో ముడి చమురు ధరలు పెరగడంతో తొలుత ఈ సంస్థనే పెట్రోల్ ధరలను పెంచింది. మార్చి 26న పెట్రోల్‌పై లీటరుకు రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. దీంతో ఆ సంస్థ అవుట్ లెట్లలో లీటర్ పెట్రోల్ రూ.100.71, డీజిల్ రూ.91.31కి చేరాయి. ఈ సంస్థ పెంచడంతో ఆ తర్వాత ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు కూడా విడతల వారీగా ధరలను పెంచేశాయి. ఆ తర్వాత ఘర్షణలు తగ్గడంతో జూలై 1న నయారా పెట్రోల్ ధరలను లీటరుకు రూ.5, డీజిల్ ధరలను రూ.3 తగ్గించింది. ఆ తర్వాత ఇప్పుడు మరోసారి పెంచుతున్నట్లు ప్రకటన జారీ చేసింది. దసరా పండక్కి ముందే ఇది ప్రజలపై భారంగా చెప్పవచ్చు. పెట్రోల్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ఇప్పటికే వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలను అక్టోబర్ 1న కేంద్రం పెంచింది. దీంతో పాటు దేశంలో ఉల్లిపాయల ధరలు పెరుగుతున్నాయి. కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.70 పలుకుతున్నాయి. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలన్నీ పెరుగుతున్నాయి. అటు అక్టోబర్ 1వ తేదీ నుంచి ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్ లాంటి ఇంట్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పెరిగాయి. ధరలన్నీ పెరగడంతో ఇంటి ఖర్చులు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యులు బెంబెలెత్తిపోతున్నారు. ఖర్చుల భారం మోయలేకపోతున్నామని వాపోతున్నారు.




## పెండింగ్ చలానా ఉంటే
# లైసెన్స్ రద్దు.. సీజ్

మొదటి పేజీ తరువాయి...

వాటికి సంబంధించి ఎలాంటి సేవలు అందించకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్డు భద్రతపై దాదాపు 14 ఏళ్లుగా సాగుతున్న కేసు విచారణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. "కేవలం వేలల్లో, లక్షల్లో ఈ-చలానాలను జారీ చేస్తే సరిపోదు. ఆ జరిమానాలను అధికారులు వసూలు చేయలేకపోతే ఈ వ్యవస్థ మొత్తానికే అర్థం ఉండదు" అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జారీ చేసిన ఈ-చలానాలలో రూ. 49,194.05 కోట్లు బకాయిలు ఉన్నాయని, కేవలం రూ. 26,175.05 కోట్లు మాత్రమే వసూలయ్యాయని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది.

**లైసెన్స్ రద్దు, సీజ్ హెచ్చరికలు**

వరుసగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్లపై కూడా సుప్రీంకోర్టు కఠినంగా వ్యవహరించింది. పదే పదే తప్పులు చేసే వారి డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) నవీకరణను నిలిపివేయాలని, అవసరమైతే ఉన్న లైసెన్స్‌ను సస్పెండ్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 2026లో అమల్లోకి వచ్చిన సవరించిన రూల్ 21(25) ప్రకారం.. ఒకే ఏడాదిలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలకు పాల్పడితే, దానిని సమాజానికి ముప్పుగా పరిగణిస్తారు. మరోవైపు రహదారులపై పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, పెండింగ్ ఈ-చలానాలు ఉన్నట్లు తేలితే ఆ వాహనాలను సీజ్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. 2025 అక్టోబర్ 28న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూపొందించిన ఎస్‌ఓపీ (ముసాయిదా)ని, మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 136ఏ, సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ 167ఏ నిబంధనలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలని తేల్చి చెప్పింది.

**ఏయే సేవలు నిలిచిపోతాయి?**

సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాల ప్రకారం.. బకాయిలు చెల్లించే వరకు వాహనదారులకు కింది ఆన్‌లైన్ సేవలను రవాణా శాఖ అధికారులు నిలిపివేయనున్నారు.

ఆర్‌సీ (నమోదు పత్రం) నవీకరణ
డూప్లికేట్ ఆర్‌సీ జారీ చేయడం
వాహన యజమాని చిరునామా మార్పు
ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ
వాహనాన్ని వేరొకరికి అమ్మడం లేదా యాజమాన్య బదిలీ (ట్రాన్స్‌ఫర్)
పీయూసీ జారీ

పెండింగ్ చలానాలు క్లియర్ అయ్యే వరకు ఏ కేంద్రం కూడా పీయూసీ సర్టిఫికెట్ ఇవ్వడానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

## ఫిబ్రవరి 3న
# క్వాంటమ్ కంప్యూటర్ ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి...

ప్రజెంటేషన్‌ను ఆసక్తిగా విన్న సీఎం వారిని అభినందించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అలాగే పాన్ ఐఐటీ సమ్మిట్‌లో దేశంలోని ప్రముఖ ఐఐటీల డైరెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ఐఐటీలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక చర్చలు జరిపారు. ఐఐటీ ఖరగ్‌పూర్, తిరుపతి, జమ్మూ, హైదరాబాద్, ధన్‌బాద్, వారణాసి, భువనేశ్వర్ ఐఐటీల డైరెక్టర్లు హాజరయ్యారు. రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, ఐఐటీల నుంచి సాంకేతికత బదిలీ, పట్టణీకరణలో డీప్‌టెక్ వినియోగం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఐఐటీల సీఎక్సఓలు, వెంచర్ క్యాపిటలిస్టులతోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. సమ్మిట్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర విజన్ కోసం ఆవిష్కరణలకు ఊతం' థీమ్‌తో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, విదేశాల్లో ఉన్న ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది భారతీయులేనని, దేశ ప్రగతికి సమాజంలో తెలివైన వారంతా కలిసి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. "అమరావతిలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ వస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న క్వాంటమ్ కంప్యూటర్ ఆవిష్కరిస్తాం. దేశంలోని ప్రతి చోటుకూ అమరావతి నుంచే క్వాంటమ్ కంప్యూటర్ సరఫరా చేస్తాం. సైబరాబాద్ ప్లస్‌గా అమరావతి మారుతుంది. దేశంలోనే అత్యున్నత నగరంగా నిర్మిస్తాం. ఐటీ విషయంలో సిలికాన్ వ్యాలీ కంటే మెరుగ్గా మారుతుంది. టెలికామ్ వ్యవస్థలో గతంలో అనేక సమస్యలు ఉండేవి. టెలికామ్ విప్లవ ఫలాలు ఇప్పుడు అందరూ అందుకుంటున్నారు. భారతీయులు అత్యంత తెలివైన వాళ్లని ప్రపంచం మొత్తానికి తెలుసు. ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకునేది తెలుగువాళ్లే. ఐటీ మేధావులతో అనేక గంటలపాటు చర్చించా. దేశంలో అనేక మార్పులను దగ్గరుండి చూశా. 1995 తర్వాత హైదరాబాద్‌కు ఐటీ తెచ్చాం. అప్పుడు తీసుకున్న చర్యలతో హైదరాబాద్ గొప్ప నగరంగా మారింది. దేశానికి సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. వాటర్ గ్రిడ్ ఉంటే మనదేశానికి ఎదురే లేదు. దేశంలోని ప్రధానమైన 5 నదులు కలపాలని కోరుకుంటున్నా" అని సీఎం అన్నారు.




# క్రీడలతో యువతకు ఉత్సాహం!

**రాజమహేంద్రవరం :జయ జయహే: అక్టోబర్ 4:**

హుక్కుంపేట యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై తమ ప్రతిభను చాటుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ సూచించారు. హుకుంపేట శ్యామలనగర్‌లోని బొప్పన స్పోర్ట్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఇన్ఫినిటీ గేమింగ్ జోన్, బౌలింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధునిక క్రీడా, వినోద వేదికలు ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో పాల్గొని శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. హుకుంపేటలో బొప్పన స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బౌలింగ్, ఇన్ఫినిటీ గేమింగ్ జోన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత శారీరకంగా, మానసికంగా చురుకుగా ఉండేందుకు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆరోగ్యకరమైన వినోదాన్ని ఆస్వాదించేందుకు ఇలాంటి స్పోర్ట్స్, గేమింగ్ సదుపాయాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో మరిన్ని క్రీడా, వినోద వేదికలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బొప్పన స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులను అభినందిస్తూ క్లబ్ విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 1 నుంచి
# కొత్త పెన్షన్ విధానం

మొదటి పేజీ తరువాయి...

కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం పింఛన్ దారులకు ఒక నిర్ణీత మొత్తంలో కొంత వాటా అందిస్తోంది. ఇప్పటివరకు ఈ కేంద్ర వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ వాటాతో కలిపి లబ్ధిదారులకు నేరుగా చేతికి అందించేవారు. ఈ పద్ధతిలో లబ్ధిదారులు ఒకేసారి పూర్తి మొత్తాన్ని అందుకునేవారు. అయితే కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఈ నిబంధన కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పింఛన్ పంపిణీ విధానంలో కీలక మార్పులు చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం.. రాష్ట్ర వాటాను మాత్రమే చేతికి అందిస్తామని, కేంద్ర వాటా లబ్ధిదారుడి బ్యాంక్ అకౌంట్లో నేరుగా జమ అవుతుందని సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ కూడా తెలిపారు. ఏపీలో ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం ద్వారా పింఛన్లను అందిస్తుండగా.. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం స్కీమ్‌ను కూడా ఆ స్కీమ్‌తో అనుసంధానించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4 రూపాయల పింఛన్ అందిస్తుండగా.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.3800, కేంద్ర వాటా రూ.200 ఉంది. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి ప్రతి నెల రూ.6 వేలు అందిస్తుండగా.. ఇందులో రాష్ట్ర వాటా రూ.5,700, కేంద్ర వాటా రూ.300గా ఉంది. ఈ మొత్తం స్వర్ణ గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అందించేవారు. ఇక నుంచి కేంద్ర వాటా నేరుగా లబ్దిదారుడు బ్యాంక్ అకంట్లో పడనుంది. పింఛన్ డబ్బులు అకౌంట్లో పడాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా తమ బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ అనుసంధానం లేకపోతే కేంద్ర వాటా పింఛన్ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావు. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేసుకోవాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు సూచిస్తున్నాయి. ఈ చర్య పంపిణీలో మరింత పారదర్శకతను తీసుకువస్తుందని, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రపంచానికి ఆంధ్ర మోడల్

మొదటి పేజీ తరువాయి...

అందరికన్నా ముందుంటుందని చెప్పారు. 'త్రీ ఎస్'తో ముందుకు: స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 'త్రీ ఎస్' మంత్రంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూసేలా ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశామని, ఒప్పందాలు చేసుకోవడంతో పాటు పరిశ్రమలు వాస్తవంగా ఏర్పాటయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సంస్కరణలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ముఖ్యమన్నారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. డీప్‌టెక్‌కు రూ.500 కోట్ల నిధి: అమరావతి కేంద్రంగా శాశ్వత ప్రాతిపదికన పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు సదస్సులో వెల్లడించారు. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ ఆంధ్రా ఫండ్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో 100 ఇండస్ట్రీ రీసెర్చ్ ఛైర్స్, 100 మది సభ్యులతో గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, అగ్రిటెక్, నీటి భద్రత తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయి. చంద్రబాబు 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌కు యంగ్ అండ్ డైనమిక్ హార్డ్‌వేర్ తోడైందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రతి 100 రోజులకు అమరావతి నిర్మాణంలో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. పాన్ ఐఐటీ సదస్సుకు హాజరైన ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. దేశంలోని 23 ఐఐటీల పూర్వ విద్యార్థులు అమరావతి వేదికగా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# బాబుది కపట నాటకం

మొదటి పేజీ తరువాయి...

ధర లేక ఉద్యానవన, ఇతర పంటల రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 'ధరల స్థిరీకరణ నిధి'ని బలహీనపరిచారని, ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసి రైతులను మరింత కష్టాల్లోకి నెట్టారని మండిపడ్డారు. సున్నా వడ్డీ రుణాల పథకాన్ని ఎత్తివేశారని, సమయానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా చేసి రైతుల వెన్ను విరిచారని ధ్వజమెత్తారు.

**రాయలసీమలో కరువు రాక్షసి.. నీళ్లెక్కడ?**

ప్రస్తుతం రాయలసీమ తీవ్ర కరువు కోరల్లో చిక్కుకుందని, వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు ఎండిపోతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు 'వాటర్ మ్యాన్' అని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని, దానిని పునరుద్ధరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీమ ప్రాంతంలో దాదాపు 7 నుంచి 8 లక్షల బోర్‌వెల్స్ ఎండిపోయాయని, పండ్ల తోటలను కాపాడుకోవడానికి రైతులు ప్రతి వాటర్ ట్యాంకర్‌కు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాయలసీమతో పాటు రాష్ట్రమంతా రైతుల ఆత్మహత్యలకు కేంద్రంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రచార ఆర్భాటాలు, డ్రామాలు కట్టిపెట్టి వెంటనే కరువు సహాయక చర్యలు ప్రారంభించి, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆసియా క్రీడల్లో... భారత్‌కు పతకాల పంట

**జయజయహే**



రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది.ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్సుకు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షుటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షుటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు. గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. స్వర్ణాల సంఖ్య కూడా 28 నుంచి 21కి పడిపోయింది. ముఖ్యంగా షూటింగ్‌లో ఏడు స్వర్ణాల నుంచి మూడింటికి తగ్గాయి. అథ్లెటిక్సులో గతంలో ఆరు స్వర్ణాలు సాధించగా ఈసారి ఒక్క పసిడి మాత్రమే దక్కింది. రోయింగ్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలు తగ్గాయి. టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో ఈసారి ఒక్క పతకం కూడా రాలేదు. పతకాల సంఖ్య తగ్గినా ఈసారి పలువురు భారత క్రీడాకారులు వ్యక్తిగతంగా చరిత్ర సృష్టించారు. మహిళల హాకీ జట్టు నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణాన్ని అందుకుంది. ఆర్చరీ, గోల్ఫ్, షుటింగ్, రెజ్లింగ్‌లో కొత్త రికార్డులు నవటరీదయ్యాయి. మొత్తంగా 20 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన భారత్ చివరి వరకు పోరాడి టాప్-5లో నిలిచింది. కొన్ని విభాగాల్లో వెనుకబడినా, మరికొన్ని క్రీడల్లో సాధించిన అపూర్వ విజయాలు ఈ ఆసియా క్రీడలను భారత క్రీడాభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండి పోయేలా చేశాయి.కాగా ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్సుకు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక సింగ్ పెనాల్టీ స్ట్రోకత్తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు. ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నవటరీదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్సుకు సిద్ధమవుతోంది.



## దివ్యాంగులకు రూ.30 లక్షల అండ

### గెయిల్ సీఎస్ఆర్ నిధులతో సహాయ పరికరాల పంపిణీకి శ్రీకారం

**రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్ 4:**

దివ్యాంగులకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు ధైర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని వి. కన్వెన్షన్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంయుక్తంగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ కోసం దివ్యాంగుల నుంచి నమోదు చేపట్టారు. లబ్ధిదారుల అవసరాలు, అర్హతలను పరిశీలించి సహాయ పరికరాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.మంత్రి నారాయణ మాట్లాడుతూ గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమానికి వినియోగించడం ద్వారా మరింత మందికి ప్రయోజనం కల్పించవచ్చన్నారు. నిధులు సమకూర్చడంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేసిన కృషిని అభినందించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం రాజమహేంద్రవరం నగరంతో పాటు పరిసర మున్సిపాలిటీల్లో సుమారు రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు మరింత ప్రయోజనం కల్పించవచ్చన్నారు. గెయిల్ సంస్థను సీఎస్ఆర్ నిధులు కోరగా రూ.30 లక్షలు కేటాయించిందని, ఈ నిధులతో నాలుగు రకాల సహాయ పరికరాలను అందించేందుకు నమోదు ప్రారంభించామని తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సీఎస్ఆర్ నిధులను సమీకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శివ్‌కుమార్, డీజీఎం హెచ్‌ఆర్ డి.వి. ప్రభాకర్, జీఎం పోతయ్య, అధికారులు నీలం ముఖర్జీ, శాంతి సాగర్, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఇన్‌ఫ్లుయెన్సర్లకు నిధులు ఉంటే నిరుద్యోగ భృతికి ఎందుకు లేవు?

**అరకులోయ: అక్టోబర్ 03. జయ జయహే.**




ప్రభుత్వ పథకాల ప్రచారం పేరుతో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రజాధనం కేటాయించడంపై సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల పన్నుల డబ్బును ప్రచారానికి ఖర్చు చేసే నిధులు ఉన్నప్పుడు, నిరుద్యోగ యువతకు నెలకు 3,000 భృతి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన 3,000 నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, గ్రామ వాలంటీర్లకు 10,000 గౌరవ వేతనం వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రజాధనం నుంచి చేస్తున్న చెల్లింపుల పూర్తి వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలని కోరారు. "ప్రజాధనం ప్రచారం కోసం కాదు.. ప్రజల సంక్షేమం కోసం. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి. నిరుద్యోగులు, వాలంటీర్లు ఎదురుచూస్తున్న హామీలను అమలు చేయాలి," అని సుజాత సల్మాన్ అన్నారు.

## మద్యం దుకాణాల దరఖాస్తు గడువు మరో మూడు రోజులు పొడిగింపు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 03, జయ జయహే**



శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ4 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే గడువును మరో మూడు రోజుల పాటు పొడిగించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. లావణ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ కింద లాటరీ విధానంలో కేటాయించేందుకు గెజిట్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 10 ఏ4 మద్యం దుకాణాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వీటిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో 3, ఏర్పేడు మండలంలో 3, తొట్టంబేడు మండలంలో 3, బి.ఎన్. కండ్రిగ మండలంలో ఒక మద్యం దుకాణం చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు.ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల తిరిగి చెల్లించని అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు.సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం అక్టోబర్ 7న దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, అక్టోబర్ 8న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించి విజేతలను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల దరఖాస్తుదారులు పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించడంతో పాటు హెల్ప్‌లైన్ నంబర్ 040-2425520ను సంప్రదించవచ్చని, లేదా స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలు తెలుసుకోవచ్చని ఆమె సూచించారు.




## స్థానికంలో కూటమి అభ్యర్థులను గెలిపించండి

**- గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించండి**

**- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి**

**- ఐదు గ్రామాలలో 2 కోట్ల 55 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**దేవరాపల్లి, అక్టోబర్ 3, జయ జయహే**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని బి.కింతాడ, వెంకటరాజపురం, తెనుగుపూడి, ఏ.కొత్తపల్లి కె.ఎం పాలెం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి పల్లె పండగ 3.0 కార్యక్రమంలో భాగంగా విబి జి రామ్ జి పథకం కింద మంజూరైన 2 కోట్ల 55 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని 111 పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు నిర్విరామంగా విద్యుత్, తాగునీరు, రోడ్లు సదుపాయంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. త్వరలో కాశీపురం - గవరవరం తారు రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో అధికారులు హాజరు కాకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. తప్పనిసరిగా అన్ని శాఖల అధికారులు తాను పర్యటనలో ఉన్నప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారిణి మంజుల వాణిని ఆదేశించారు. అనంతరం ఏ. కొత్తపల్లిలోని పశువుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామనాయుడు, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రు నాయుడు, టిడిపి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు, వనం వెంకటేష్, గోగాడ వెంకటరావు, పెంటకోట అప్పలనాయుడు, సి ఏ నాయుడు, గంధం లక్ష్మి జగన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసిటీలో బాయిలర్ పేలుడు.. ఐదుగురు మృతి

### మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం

**శ్రీసిటీ, అక్టోబర్ 03, జయ జయహే**

శ్రీసిటీ పరిధిలోని టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమలో శనివారం ఉదయం బాయిలర్ పేలిన ఘటనలో ఐదుగురు కార్మికులు మృతి చెందారు. రెండు టన్నుల సామర్థ్యం గల బాయిలర్ పేలడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, శిథిలాలు తగిలి మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మృతుల్లో ఒకరు కోల్‌కతా, ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు స్థానిక ప్రాంతాలకు చెందినవారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం రెండు రోజుల్లో అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మృతుల పిల్లల ఉన్నత విద్య ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యం భరిస్తుందని, అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్రమాదంపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే మూడో పక్ష భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్‌రెడ్డి, శ్రీసిటీ ఎండీ రవిఅన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ప్రమాదంపై పవన్ కళ్యాణ్ ఆరా

### సమగ్ర భద్రతా తనిఖీలకు ఆదేశం

**శ్రీసిటీ, అక్టోబర్ 03, జయ జయహే**




శ్రీసిటీ: శ్రీసిటీలోని పరిశ్రమలో చోటుచేసుకున్న బాయిలర్ పేలుడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సహాయక చర్యలపై ఆరా తీశారు.ప్రమాదం నేపథ్యంలో శ్రీసిటీలోని పరిశ్రమల్లో సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులకు సూచించారు.



## మృతుల కుటుంబాలకు గంటా పరామర్శ

### యు.ఎ.ఈ. నుంచి భాస్కరరావును రప్పించే చర్యలు

**విశాఖపట్నం, అక్టోబర్ 3 (జయ జయహే)**

మధురవాడ ఐటీ సెజ్ బీచ్ లో మునిగి మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం కేజీహెచ్ లో పరామర్శించారు. ఎంతో భవిషత్ ఉన్న చిన్నారుల మరణం తీవ్రంగా కలచి వేసిందన్నారు. పెద్దగా టూరిస్టులు రాని ఐటీ సెజ్ బీచ్ లో వినాయక నిమజ్జనాల కోసం ఏర్పాట్లు చేశారని, దాన్ని మూసివేయాలని ఆదేశించామని తెలిపారు. భవిష్యత్ లో ఇలాంటి దురదృష్టకర ఘటనలు జరగకుండా కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నెల రోజుల క్రితం ఉపాధి కోసం యు.ఎ.ఈ. వెళ్లిన మృతుడు సతరావు సూర్యప్రకాష్ తండ్రి భాస్కరరావు భారతదేశానికి రావడానికి కంపెనీ సెలవు ఇవ్వని విషయాన్ని గంటా దృష్టికి తీసుకురాగా ఢిల్లీలో ఏపీ వ్యవహారాలు చూసే ఐ.ఎ.ఎస్. అధికారి ఆర్జా శ్రీకాంత్ తో మాట్లాడారు. ఎంబసీ తో మాట్లాడి భాస్కరరావును రప్పిస్తామని పేర్కొన్నారు.

For a pure tomorrow..
జయ జయహే



# అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కమలాకర్

## కీలక బాధ్యతలు అప్పగించిన పీసీసీ చీఫ్ షర్మిల

### తన సేవలకు గుర్తింపుగానే తాజా బాధ్యతలన్న కమలాకర్

**విజయవాడ, అక్టోబర్ 3, జయ జయహే:**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో జి.వి.వి.ఎస్. కమలాకర్‌కు అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ఆదేశాల మేరకు కమలాకర్‌ను అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు తాజాగా మరో ముఖ్యమైన బాధ్యతను అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం పట్ల కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్న తన సేవలను పార్టీ గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ అనకాపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తానని కమలాకర్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండల స్థాయిలో పార్టీ శ్రేణులను సమీకరించి, కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ తీసుకురావడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని కమలాకర్ స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# ఉడుత-చిన్న సహాయం కూడా విలువైనదే

## మహాసేతువులో చిన్న ఇసుక రేణువులు

**ప్రజాదరణ పొందిన రామకథా సంప్రదాయంలో ఉడుత కథ చిన్న ప్రయత్నానికి ఉన్న గొప్ప విలువను తెలియజేస్తుంది. లంకకు చేరుకోవడానికి వానరసేన సముద్రంపై సేతువు నిర్మిస్తోంది. బలవంతులైన వానరులు కొండలను, భారీ రాళ్లను తీసుకొచ్చి సముద్రంలో వేస్తున్నారు. ఆ మహత్తర కార్యాన్ని గమనించిన ఒక చిన్న ఉడుత కూడా తన వంతు సహాయం చేయాలని నిర్ణయించుకుంటుంది.**

**ఉడుత వానరుల్లా పెద్ద రాళ్లను మోయలేదు. అది సముద్ర తీరంలోని ఇసుకలో పొర్లి, తన శరీరానికి అంటుకున్న రేణువులను సేతువు నిర్మిస్తున్న చోట దులిపింది. మళ్లీ ఇసుకలో పొర్లి, మరికొన్ని రేణువులను తీసుకొచ్చింది. దాని సహాయం పరిమాణంలో చిన్నదైనా, ప్రయత్నంలో సంపూర్ణమైనది.**




### శ్రీరాముని దృష్టిలో సమానమైన కృషి

ఉడుత చేస్తున్న పనిని కొందరు వానరులు చూసి నవ్వినట్లు కథ చెబుతుంది. తమ భారీ కృషితో పోలిస్తే దాని ఇసుక రేణువులు ఏం చేయగలవని ప్రశ్నిస్తారు. కానీ శ్రీరాముడు ఉడుతను ప్రేమతో చేతిలోకి తీసుకొని దాని ప్రయత్నాన్ని అభినందిస్తాడు. తన సామర్థ్యమంతా ఉపయోగించిన ఉడుత సేవ, పెద్ద రాళ్లను మోసిన వానరుల సేవకు ఏమాత్రం తక్కువ కాదని తెలియజేస్తాడు.

ఈ సంఘటన కృషి విలువను పరిమాణంతో మాత్రమే కొలవకూడదని బోధిస్తుంది. ఒక ధనవంతుడు పెద్ద మొత్తాన్ని విరాళంగా ఇవ్వవచ్చు; పేదవాడు చిన్న మొత్తమే ఇవ్వగలడు. కానీ చిన్న మొత్తంలో అతని త్యాగం ఎక్కువగా ఉండవచ్చు. అందువల్ల సహాయం వెనుక ఉన్న మనసు, పరిస్థితి, నిబద్ధతను గుర్తించాలి.

### "నా ఒక్కరి వల్ల ఏమవుతుంది?" అనే ప్రశ్న

ఆధునిక సమాజంలో చాలామంది సమస్యలను చూసి నిరాశ చెందుతారు. పర్యావరణ కాలుష్యం, అవినీతి, నిరక్షరాస్యత, పేదరికం వంటి పెద్ద సమస్యల ముందు తమ ప్రయత్నం చాలా చిన్నదని భావిస్తారు. "నేను ఒక్క మొక్క నాటితే ఏమవుతుంది?", "ఒక విద్యార్థికి సహాయం చేస్తే సమాజం మారుతుందా?" అని ప్రశ్నిస్తారు.

అయితే ప్రతి ఒక్కరూ ఇదే విధంగా ఆలోచిస్తే ఏ మార్పూ ప్రారంభం కాదు. కోట్ల మంది ఒక్కొక్క మొక్క నాటితే అది పచ్చని ఉద్యమంగా మారుతుంది. ప్రతి కుటుంబం నీటిని ఆదా చేస్తే జలసంరక్షణ సాధ్యమవుతుంది. ప్రతి చదువుకున్న వ్యక్తి ఒక చిన్నారికి విద్యలో సహాయం చేస్తే నిరక్షరాస్యత తగ్గుతుంది. చిన్న చర్యలు కలిసినప్పుడే పెద్ద మార్పు ఏర్పడుతుంది.

### కనిపించని చేతుల కృషి

కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రాజకీయ సంస్థలు లేదా సామాజిక ఉద్యమాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారికే సాధారణంగా గుర్తింపు లభిస్తుంది. కానీ కార్యాలయాన్ని శుభ్రం చేసే వ్యక్తి, కార్యక్రమానికి కుర్చీలు అమర్చే కార్మికుడు, దస్త్రాలను సిద్ధం చేసే సహాయకుడు, స్వచ్ఛందంగా పనిచేసే కార్యకర్త---వీరందరి కృషి లేకుండా ఏ కార్యక్రమమూ విజయవంతం కాదు.

మంచి నాయకుడు తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలి. శ్రీరాముడు ఉడుత సేవను గుర్తించినట్లే, సంస్థలు చిన్న ఉద్యోగుల కృషిని గౌరవించాలి. గుర్తింపు మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి మరింత బాధ్యతతో పనిచేసేలా చేస్తుంది.

### చిన్న సహాయం---పెద్ద ఆశ

వృద్ధుడిని రోడ్డు దాటించడం, దాహంతో ఉన్నవారికి నీరు ఇవ్వడం, విద్యార్థికి పుస్తకం అందించడం, ఆసుపత్రిలో రోగికి రక్తదాత వివరాలు చెప్పడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించవచ్చు. కానీ సహాయం పొందిన వ్యక్తికి అవే ఆ సమయంలో ప్రపంచమంత విలువైనవిగా ఉంటాయి.

గొప్ప లక్ష్యాలు మహానాయకుల కృషితో మాత్రమే సాధ్యం కావు. పేరు తెలియని అనేకమంది చేసిన చిన్నచిన్న సహాయాలు కలిసినప్పుడే విజయసేతువు నిర్మితమవుతుంది. ఉడుత మనకు చెప్పేది స్పష్టం---మన సహాయం చిన్నదై ఉండవచ్చు; కానీ సహాయం చేయాలనే మనసు ఎన్నటికీ చిన్నది కాదు.

ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు



# భారత ఆర్థిక రంగంలో కీలక పరిణామాలు

(ప్రతాప్)




### రూ.1 లక్ష కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లో రిలయన్స్ భారీ విస్తరణ

దేశ కార్పొరేట్ రంగంలో ఈరోజు అత్యంత ప్రాధాన్యం పొందిన వార్తల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టనున్న భారీ పెట్టుబడి ప్రణాళిక ముఖ్యమైనది. సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడులు ప్రధానంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాలు, అనుబంధ మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 3 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీర్ఘకాలంలో ఈ ప్రాజెక్టులు రూ.60,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సృష్టించే సామర్థ్యం కలిగి ఉన్నాయని సంస్థ పేర్కొంది. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశాన్ని ముందంజలో నిలిపే ప్రయత్నాల్లో భాగంగానే ఈ భారీ పెట్టుబడి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వృద్ధి, గ్రామీణ ఉపాధి, వ్యవసాయ అవశేషాల వినియోగం వంటి రంగాల్లో ఈ ప్రాజెక్టు ప్రభావం చూపనుంది. రాష్ట్రానికి ఇటీవల కాలంలో వచ్చిన అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఇదొకటిగా పరిగణిస్తున్నారు.

### భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు వేగం, ఒప్పందం మాత్రం ఇంకా దూరం

భారత్, అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ తుది అంగీకారం ఇంకా కుదరలేదని అమెరికా వాణిజ్య ప్రతినిధులు వెల్లడించారు. జీ-20 వాణిజ్య మంత్రుల సమావేశం సందర్భంగా భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని అమెరికా అధికారులు పేర్కొన్నారు. ఇదే సమయంలో భారత్ యూరోపియన్ యూనియన్, కెనడా, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాల పురోగతిని సమీక్షిస్తోంది. గ్లోబల్ మార్కెట్లలో భారత ఎగుమతుల వాటాను పెంచడం, సుంకాల అడ్డంకులను తగ్గించడం, తయారీ రంగానికి కొత్త అవకాశాలు కల్పించడం ఈ చర్చల ప్రధాన లక్ష్యంగా ఉంది. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, అమెరికాతో సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత తయారీ, ఔషధ, ఐటీ, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం చర్చలు పురోగమిస్తున్నప్పటికీ పరిష్కారం కాని కొన్ని కీలక అంశాల కారణంగా ఒప్పందం తక్షణమే కుదిరే అవకాశాలు కనిపించడం లేదు.

### చమురు షాక్‌తో పెరుగుతున్న పరిశ్రమల వ్యయభారం

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల భారత పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెట్రోల్, డీజిల్ వినియోగదారుల ధరల్లో ఇప్పటివరకు పెద్దగా మార్పులు లేకపోయినా, తయారీ రంగంలో ముడి పదార్థాల వ్యయం గణనీయంగా పెరిగినట్లు తాజా అంచనాలు సూచిస్తున్నాయి. పరిశ్రమల లావాదేవీలను విశ్లేషించే గణాంకాల ప్రకారం, జూలై నుంచి సెప్టెంబర్ మధ్య పాలీప్రొపిలీన్ గ్రాన్యూల్స్ ధరలు సుమారు 32 శాతం పెరిగాయి. ప్యాకేజింగ్, ప్లాస్టిక్, రసాయనాలు, వినియోగ వస్తువుల తయారీ రంగాలు ఈ పెరుగుదల ప్రభావాన్ని నేరుగా ఎదుర్కొంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరగడంతో అనేక సంస్థల లాభ మార్జిన్లు ఒత్తిడికి గురవుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పామ్ ఆయిల్, చక్కెర, హెచ్‌డీపీఈ వంటి కీలక ముడి పదార్థాల ధరలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో వినియోగ వస్తువుల కంపెనీలకు రానున్న త్రైమాసికం సవాల్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. చమురు ధరల ప్రభావం ప్రత్యక్షంగా ఇంధన బంకుల వద్ద కనిపించకపోయినా, పరిశ్రమల వ్యయభార రూపంలో ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోందని ఆర్థిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.







మానవ జీవితంలో భక్తి అనగా పూజలు చేయడం, ప్రదక్షిణలు, పారాయణలు చేయడం,యాగాలు చేయడం, యజ్ఞాలు చేయడం, ఎక్కువగా ధనాన్ని వెచ్చించి ఆలయాలు నిర్మాణం చేయడం, సంతర్పణలు అన్న దానాలు, నగదు వస్తు రూపేణా సహాయం చేయడం, ధనముతో కూడిన దాన ధర్మాలు ఈ పనులు ఏమైనా భక్తి కాదు.

భగవంతుడు దేవాలయాల్లో విగ్రహం రూపంలో మాత్రమే ఉంటాడు.ఎవరు అయితే ఎల్లవేళలా నిజాన్ని మాట్లాడతారో, నిజాయితీగా నీతి పరంగా నడుచుకుంటారో,వారి రూపంలో ఎల్లప్పుడూ వారి యొక్క హృదయం అంతరంగాలు కొలువైయుంటాడు.

కలియుగంలో మానవులు అంతా చాలా వారి వారి యొక్క స్వవిషయాలలో ఒత్తిడిలో పడి పనులతో శతమతమయ్యి, దేవుడికి ఇష్టమైన పనులు చేయడం మర్చిపోతున్నారు. తనదైన పనిలో ఎంత తీరిక లేకున్నా కొంత సమయాన్ని భగవన్నామస్మరణ చేయడం కలియుగములో అసలైన భక్తి. మంత్రాలు చదవనవసరం లేదు.చిన్న భగవంతుడు నామాన్ని ఉచ్చరించి జపిస్తే చాలు అదే నిజమైన భక్తి. ఎవరైనా మనకు సహాయం అందించినప్పుడు కృతజ్ఞతా భావాన్ని చూపడమే అసలైన భక్తి చాలా కష్టాల్లో కూరుకుపోయిన వారికి చేయూతనివ్వడమే పరమేశ్వరాభిషేకం ఇదే అసలైన భక్తి. జీవితంలో వచ్చిన సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలిపే భగవద్గీత గ్రంధాల్లో ఉన్న శ్లోకాలు అన్నింటికీ మనకు మనమే అర్థం తెలుసుకొని ముందుకు నడవడమూ భక్తే.

మన బలాన్ని భక్తిగా సహాయం రూపంలో మలచడమే నిజమైన భక్తికి నిర్వచనం.

రచన
ఏ బాల సౌజన్యకుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మికవేత్త,ప్రవచనకర్త

# అవార్డు ఒకవైపు.. అరకు ఏరియా ఆసుపత్రిలో పరిశుభ్రత పరిస్థితి మరోవైపు!





### స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్రలో వరుసగా రెండోసారి అవార్డు..

### పేషెంట్ బెడ్లపై బెడ్‌షీట్లు కూడా కరువు

### బాత్రూంలు, పరిసరాల పరిశుభ్రతపై రోగుల ఆవేదన..

### అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్

**అరకులోయ, అక్టోబర్ 03: జయ జయహే.**

అరకు ఏరియా ఆసుపత్రికి స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆసుపత్రి విభాగంలో అవార్డు లభించడం పట్ల ఒకవైపు హర్షం వ్యక్తమవుతుండగా, మరోవైపు ఆసుపత్రిలో నెలకొన్న పారిశుధ్య పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి చేతుల మీదుగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏ. రాము అవార్డును అందుకున్నారు. వరుసగా రెండోసారి ఈ గుర్తింపు రావడం గర్వకారణమని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఆసుపత్రి పరిశుభ్రతతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు లభించినట్లు వెల్లడించారు. అయితే ఆసుపత్రిలోని కొన్ని వార్డుల్లో వాస్తవ పరిస్థితులు మాత్రం ప్రశ్నార్థకంగా ఉన్నాయని రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేషెంట్ బెడ్లపై కనీసం శుభ్రమైన బెడ్‌షీట్లు కూడా సక్రమంగా అందుబాటులో లేని పరిస్థితి కనిపిస్తోందని, పాతబడిన, దెబ్బతిన్న బెడ్ మెట్రెస్సులు వినియోగంలో ఉన్నాయని చెబుతున్నారు. ఆసుపత్రి బాత్రూంల పరిశుభ్రతపై కూడా రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు స్వచ్ఛ ఆసుపత్రిగా అవార్డు.. మరోవైపు రోగులకు కనీస పరిశుభ్రత సౌకర్యాలు అందని పరిస్థితి ఎలా ఏర్పడిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవార్డు కోసం నిర్వహించే పరిశీలన సమయంలో మాత్రమే కాకుండా, ప్రతిరోజూ ఆసుపత్రిలోని వార్డులు, బెడ్లు, బాత్రూంలు, పరిసరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రోగులకు పరిశుభ్రమైన బెడ్‌షీట్లు, నాణ్యమైన బెడ్లు, శుభ్రమైన బాత్రూంలు, తగినంత పారిశుధ్య నిర్వహణ అందేలా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవార్డుకు తగ్గట్టుగా ఆసుపత్రి నిర్వహణను మెరుగుపరచి, రోగులకు స్వచ్ఛమైన--సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## డొంకపుట్టులో 61 మందికి భూ హక్కు పట్టాలు పంపిణి



**అనంతగిరి: అక్టోబర్ 03. జయ జయహే.**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం వేంగడ పంచాయతీ డొంకపుట్టు గ్రామంలో 61.మందికి పట్టా పాస్ బుక్ లు గ్రామ పంచాయతీ రెవిన్యూ అధికారి ఎస్ రాంబాబు వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడతూ, స్వంతంత్రం వచ్చి 80 సంవత్సరాల తర్వాత రిసర్వే చేసి భూమి హక్కు పట్టాలు రావడం జరిగింది. ప్రజలు అందరు బెంక్ లోన్. పి ఎమ్ కిషన్. రైతు భరోసా. తదితర అవసరాల కోసం అవసరం వస్తుంది. కావున ప్రతి రైతు ఈ అవకాశం నికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో వేంగడ సూపర్ సర్పంచ్ ఎస్ బుట్టన్న. మాజీ ఎంపీటీసీ. మజ్జి గంగన్న. కూటమి నాయకులు రాంనాయుడు. అప్పన్న. గ్రామస్తులు.పెసా కార్యదర్శి కళ్యాణ్. అనిల్. వి అర్ పి. క్రిష్ణ. వెంకట్. బాలు.వి అర్ ఏ. గుండు తదితరులు పాల్గొన్నారు

## న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు పెంపు

### న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

**అమరావతి,అక్టోబరు3 (జయ జయహే )**




రాష్ట్రంలో పనిచేస్తున్న న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును పెంచుతూ ఈనెల 1వ తేదీన రాష్ట్ర గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేసినట్లు న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.ప్రస్తుతం ఉన్న న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 61 నుండి 62 సంవత్సరాలకు పెంపు చేసినట్లు శనివారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ పెంపు 31-03-2026 నుండి అమల్లోకి వచ్చినట్లుగా భావించబడుతుందని పేర్కొంటూ రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో గెజిట్ ప్రచురణ కూడా ప్రచురించబడినట్లు మంత్రి తెలిపారు. కాగా గతంలో 01-11-2024 నుంచి అమలులోకి వచ్చేలా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుండి 61 సంవత్సరాలకు పొడిగించబడిన విషయం తెలిసిందేనని మంత్రి ఫరూక్ తెలిపారు. ఆ పిమ్మట భారత సర్వోన్నత న్యాయస్థానశీ సుప్రీంకోర్టు 05-08-2026వ తేదీన 1989 యొక్క డబ్ల్యు.పి.(సి) నెం.1022లో జారీచేసిన మధ్యంతర ఉత్తర్వు లో సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని, న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని పునః పరిశీలించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించడశీ జరిగిందన్నారు. దీనిపై 24-08-2026న జరిగిన పూర్తిస్థాయి సమావేశంలో ఏపీ హైకోర్టు ధర్మాసనం కూడా 62 ఏళ్లకు పెంచాలని తీర్మానించిందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు సిఫారసుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనతో గవర్నర్ ఆర్డినెన్స్ జారీ అయిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.

## జడ్పీహెచ్ ఎస్ఎంసి ఎన్నికలు రెండోసారి వాయిదా

### ఎంఈఓ కార్యాలయాన్ని చుట్టుముట్టిన విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు.

### గతంలో కోరం, ప్రస్తుతం ఎస్కార్ట్ లేదంటున్న ఎంఈఓ శైలజ

### రాజకీయాలే కారణం అంటున్న పలువురు విద్యార్థి విద్యార్థిని తల్లిదండ్రులు .

**జయ జయహే - ఓజిలి :**

ఓజిలి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎన్నికలు రెండు పర్యాయం వాయిదా వెనుక అధికారుల అసమర్థత లేక రాజకీయ కారణాలు తెలియడం లేదని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండో పర్యాయం జడ్పీహెచ్ ఎస్ఎంసి ఎన్నికలు అనూహ్య రీతిలో వాయిదా పడ్డాయని అధికారులు వెల్లడించడంతో ఒక్కసారిగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనతో తమ పిల్లలతో కలిసి ర్యాలీగా ఎంఈఓ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ప్రైవేటు స్కూల్లో చదివించలేక కూలి పనులు ఫ్యాక్టరీలకు వెళ్లి తమ జీవనం సాగిస్తున్నామని, తమ పిల్లల్ని మానసిక ఒత్తిడి చేసి మమ్మల్ని స్కూల్ కి పిలిపించి ఇక్కడ అధికారులు వారి ఇష్టాన్ని రీతిలో ఎన్నికలు వాయిదా వేస్తూ తల్లిదండ్రులను ఉప్పు తిప్పలు పెట్టడం అధికారులకు ఏమాత్రం సరికాదని వారు వాపోయారు. ఇన్చార్జి హెచ్ఎంతోపాటు ఎంఈఓ లను ఎస్కార్ట్ లేకపోతే ఉదయం తోనే సమాచారం ఇచ్చుంటే మా పనులు చేసుకునే వాళ్ళం కదా అని నిలదీశారు. ఎంఈఓ శైలజ ఎస్కార్ట్ లేనందువల్ల శనివారం జరగాల్సిన ఎస్ఎంసి ఎలక్షన్లో వాయిదా వేసినట్లు విలేకరులకు వివరణ ఇచ్చారు. అయితే ఎస్కార్ట్ లేకుండా శనివారం ఎలక్షన్లు అనౌన్స్మెంట్ చేసి పత్రికలకు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వెనక ఎంఈఓ ను గట్టిగా నిలదీశారు. రాజకీయాలు ఉంటే ఉద్యోగాలు వదిలేసి రాజకీయాలు చేసుకోవచ్చు కదా విద్యార్థుల జీవితాలతో తల్లిదండ్రుల జీవనశైలితో ఆడుకోవడం ఉన్నత చదువులు చదువుకున్న అధికారులు తెలుసుకోవాలని ఎవరి డిమాండ్ చేశారు. సాదాసీదాక జరగాల్సిన ఓజిలి జడ్పీహెచ్ ఎన్నికలు రాజకీయంగానే కాకుండా ఓజిలి మండలం తో పాటు జిల్లా స్థాయిలో ప్రస్తుతం వైరల్ గా మారిందని పలువురు తల్లిదండ్రులు చెప్పుకొస్తున్నారు. ఎన్నడు లేని విధంగా ఓజిలి మండలంలో జడ్పీహెచ్ ఎస్ఎంసి ఎన్నికలు హాట్ టాపిక్ గా మారాయి. పలువురు విద్యార్థిల తల్లిదండ్రులు రోజుల తరబడి పాఠశాల చుట్టూ తిరగలేమని అవసరమైతే ఎన్నికలను బహిష్కరిస్తామని ఆవేద వ్యక్తం చేశారు. సోమవారం అయినా సంబంధిత అధికారులు ఓజిలి జడ్పీహెచ్ ఎస్ఎంసి ఎన్నికలను సజావుగా సాగిస్తారో లేదో వేచి చూడాలి.






### తర్లగూడలో

## నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన భూ పునఃసర్వేలో భాగంగా, "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమం ద్వారా నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపట్టారు. ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ పంచాయతీ పరిధిలోని తర్లగూడ గ్రామంలో శనివారం భూ యజమానులకు రాజముద్రతో కూడిన 43 నూతన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సిరగం భాగ్యవతి మాట్లాడుతూ.. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం చేపట్టిన భూ పునఃసర్వే ద్వారా గ్రామంలోని నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ పునఃసర్వే చేపట్టేలా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి కృషి చేస్తానని తెలిపారు.రైతులు తమ భూమిపై హక్కును నిరూపించుకోవడంతో పాటు చట్టపరమైన రక్షణ పొందేందుకు సరైన భూ పత్రాలు కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. భూమి హక్కుదారుల వివరాలు, ఖాతా సంఖ్య, భూమి వర్గీకరణ తదితర వివరాలను 1-బి రికార్డు స్పష్టంగా తెలియజేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సర్వేయర్ లలిన్ కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలకంఠం, దేవా, లక్ష్మీనారాయణ, వార్డు కన్వీనర్లు భాస్కర్, వెంకటరావు, గణేష్, సుబ్బారావు, మొంగు తదితరులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్స్-2026లో శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి అవార్డు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

స్వచ్ఛత, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తూ ప్రత్యేక ప్రతిభ కనబరిచిన నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానానికి స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్స్--2026లో జిల్లా స్థాయి అవార్డు లభించింది.మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సమావేశ మందిరంలో స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్స్--2026 జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం తరపున అవార్డును అందుకున్నారు.దేవస్థాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడం, వ్యర్థాల నిర్వహణలో తగిన చర్యలు చేపట్టడం, భక్తులకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో ఆలయం కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై జనసేన నేతల విస్తృత చర్చ

**అరకులోయ , అక్టోబర్03: జయ జయహే.**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణుల సమన్వయం, గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతం, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై జనసేన పార్టీ నాయకులు పాడేరులోని పార్టీ కార్యాలయంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ నాయకులు డా. వంపూరు గంగులయ్యను జనసేన పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్టి చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం, ఎన్నికలకు అవసరమైన కార్యాచరణను రూపొందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య, మహిళా నాయకురాలు, వీర మహిళ పద్మ, జనసేన పార్టీ ఐటీ ఇన్‌చార్జి దండుసేన నవీన్, పద్మాపురం పంచాయతీ ఇన్‌చార్జి అర్మానైని చిన్న, అరకు పంచాయతీ ఇన్‌చార్జి కొరుకొండ శ్రీనివాసు, చోంపి పంచాయతీ ఇన్‌చార్జి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై తప్పుడు కేసులను ఎత్తేయాలి

## వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్

**అల్లిపురం, అక్టోబర్ 3, జయ జయహే :**




నగరంలోని పలువురు జర్నలిస్ట్ లపై బనాయించిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని సిపిఐ ఎంఎల్ - న్యూడెమోక్రసీ విశాఖ విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని అల్లిపురంలో గల సిపిఐ కార్యాలయంలో శనివారం వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక కేసులో అరెస్టు చేయవద్దని హైకోర్టు చెప్పినప్పటికీ, ఏదో ఒక రకంగా అరెస్టు చేయాలనే దురుద్దేశంతో మరో తప్పుడు నాన్ బెయిలబుల్ కేసు ఆరిలోవ పోలీస్ స్టేషన్ లో ఈ నెల 30న నమోదు చేసి మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులోఇచ్చిన ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ ను పరిశీలిస్తే ఆ ముగ్గురుపై తప్పుడు కేసుగా అవగతం అవుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుకు మరొక వ్యక్తికి మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీల విషయంలో మధ్యవర్తిగా ఉన్న ఒక జర్నలిస్టు ఆ లావాదేవీల విషయంలో మూడు నెలల కిందట వాట్సాప్ మెసేజ్ పెట్టారని పేర్కొన్నారు. ఆ మెసేజ్ తో ఈ విషయానికి ఎలాంటి సంబంధం లేనప్పటికీ దాంతో ముడిపెట్టి, వక్రీకరించి ఈ ముగ్గురిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారన్నారు. ఆ మెసేజ్ పరిశీలిస్తే ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ఏమీ దానిలో లేవని తెలిపారు. నిరాధారమైన ఈ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రెహమాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ పత్రికలు వార్తలు రాస్తే కేసులు బనాయించడం దారుణమని మండిపడ్డారు. భూకబ్జాదారులతో అధికార పార్టీ నాయకులు, పోలీసులు కుమ్మక్కై ఇలాంటి చర్యలకు దిగుతున్నారని పేర్కొన్నారు. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణారావు మాట్లాడుతూ గీతం యూనివర్సిటీ భూకబ్జాతో పాటు జిల్లాలో అనేకమంది ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారన్నారు. వాటిపై వార్తలు రాసే పత్రికలపై తప్పుడు కేసులు తగదని మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలకు జీవీఎంసీ అడ్డుకట్ట వేయడానికి బదులు, అధికారులు వారికి అమ్ముడైపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. లక్ష్మి మాట్లాడుతూ గీతం యూనివర్సిటీలో భూకబ్జాలు , ముదపాక భూములు సమస్య తదితరుల అంశాలపై వార్తలు రాస్తున్న నేపథ్యంలో వారి ప్రమేయంతోనే ఈ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఫిర్యాదుదారుడు ఈ అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణం చేశాడని, జీవీఎంసీ అధికారులు ఇచ్చిన ప్లాన్ కు ఈ నిర్మాణానికి ఎలాంటి సంబంధం లేదనే ఆరోపణలపై అధికారులు నిగ్గు తేల్చి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## బిన్-బ్యాగ్ వ్యవస్థపై ఎక్స్‌పోజర్ విజిట్ మరియు అవగాహన..

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 04,**



కొయ్యూరు మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం బిన్-బ్యాగ్ వ్యవస్థపై ఎక్స్‌పోజర్ విజిట్ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త (ఆకులు, కూరగాయల వ్యర్థాలు), పొడి చెత్త (ప్లాస్టిక్, కాగితం), ప్రమాదకర చెత్త (బ్యాటరీలు, మందుల వ్యర్థాలు)గా వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఆకుపచ్చ బిన్ లో తడి చెత్త, నీలం బిన్ లో పొడి చెత్త, ఎరుపు బిన్ లో ప్రమాదకర చెత్త వేయాలని ప్రదర్శన ద్వారా వివరించారు. గ్రామ పారిశుధ్య కార్మికులకు సహకరించి, గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



### భారత ఎన్నికల అధికారి

## జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

### సిపిఎం నిరసనల ర్యాలీ

**టెక్కలి అక్టోబర్ 3 జయ జయహే**

భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య విలువలను పతనమయ్యేలా తన వ్యవహార తీరుతో 13 కోట్ల ఓ టర్లను గల్లంతు చేయడం భావ్యం కాదని ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఇటువంటి అధికారిని తక్షణమే వి ధుల నుంచి తొలగించాలని సిపిఎం జిల్లా ప్రతినిధి నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. టెక్కలి పట్టణములో ఈ మేరకు నిరసనలతో కూడిన ర్యాలీ నిర్వహించారు, బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాల్లో అక్షర తప్పుల పేరుతో ఓటర్లను తొలగించడం భావ్యం కాదని ఆయన అన్నారు. గతంలో సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులతో కమిటీ ఉండేదని ప్రస్తుతం ఎన్నికల కమిషనర్ హవా కొనసాగుతుందని దీని వెనుక బిజెపి పెద్దలు అండదండలు ఉన్నాయని ఆయన విమర్శించారు. భారత ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తగవని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు, ఆంధ్ర రాష్ట్రంలో32 లక్షల ఓట్లు గల్లంతం జరిగితే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బిజెపి ప్రభుత్వానికి, జ్ఞానేష్ కుమార్ కు మద్దతు పలికి మాట్లాడడం చాలా విచారకరమన్నారు, సిపిఎం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు, ప్రత్యేక ఓటరు సవరణ జాబితా సర్ ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రతినిధులు ఉ ర్జాన లక్ష్మణరావు, హెచ్ ఈశ్వరరావు, బాగా ది వాసుదేవరావు, డి శాంతారావు, ప్రసాద్, సరస్వతి, కే ఎన్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బి ప్రభాకర్ రావు, అన పాన షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగ పరిరక్షణకు కృషి చేసిన నాయకులకు సన్మానం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 03, జయ జయహే**



శ్రీకాళహస్తి మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లా చేనేత కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో చేనేత రంగ పరిరక్షణకు కృషి చేసిన పాతతరం నాయకుల అభినందన సభను నిర్వహించారు. య నియన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. డి. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఏపీసీఓ డైరెక్టర్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ అహింసా మార్గంలో పోరాటం సాగిస్తూ, క్విట్ ఇండియా ఉద్యమం, స్వదేశీ వస్త్రాల వినియోగం వంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి మహాత్మా గాంధీ విశేష సేవలందించారని పేర్కొన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తాను చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని పవన్ కళ్యాణ్ ప్రకటించడం పట్ల చేనేత వర్గాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం నేతన్న సేవ పథకం ద్వారా రూ.25 వేల ఆర్థిక సహాయం అందించడం చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందనడానికి నిదర్శనమని అన్నారు. అనంతరం సుమారు 45 మంది పాతతరం చేనేత కార్మిక నాయకులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. చేనేత రంగానికి, కార్మికులకు 35 సంవత్సరాలుగా అండగా నిలిచిన యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. డి. రామకృష్ణ దంపతులను శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఏ. మోహన్, గేట్, గీతం విద్యాసంస్థల అధినేత, జనసేన తిరుపతి పార్లమెంటు పరిశీలకుడు తమ్మినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర చేనేత సమైక్య నేత మాచర్ల మోహన్‌రావు, విశ్రాంతి ప్రొఫెసర్లు డా. రెడ్డప్పరెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. చేనేత కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు.



## అగనంపూడి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**అగనంపూడి, అక్టోబర్ 3, జయ జయహే**

ఏపీ ఈపీడీసీఎల్ జోన్--2 ఈఈగా బాధ్యతలు స్వీకరించిన బి. కోటేశ్వరరావు నాయుడును ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అగనంపూడి పునరావాస కాలనీలో లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, మీటర్ రీడింగ్‌లో జాప్యాన్ని నివారించాలని, కొత్త మీటర్లను పారదర్శకంగా సకాలంలో అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అగనంపూడి సెక్షన్ కార్యాలయం జోన్--2లో విలీనం అయిందని ఈఈ కోటేశ్వరరావు నాయుడు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని, సమస్యలపై 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సకఖల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



## అత్యంత భక్తిశ్రద్ధలతో గోపూజ

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే

**కర్నూలు (జయ జయహే)**

పితృ దేవతలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ పక్షం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పవిత్రమైన గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పాణ్యం మండలం, కౌలూరు గ్రామంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి భజన మందిరం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోమాతకు పసుపు, కుంకుమ, పూలమాలలతో అలంకరించి, వేద మంత్రోచ్చారణల నడుమ గోపూజ నిర్వహించారు. అనంతరం సౌభాగ్యానికి, ఐశ్వర్యానికి ప్రతీక అయిన గోమాతకు పూజానంతరం కుంకుమార్చన చేయించి, మహిళా భక్తులచే సామూహిక పారాయణం చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో మహాలయ పక్షాలు పితృ దేవతలను స్మరించుకుని, గోసేవ చేయడం వల్ల పితృదోషాలు తొలగి, పితరులు సంతృప్తి చెందుతారని, గోవులో 33 కోట్ల దేవతలు కొలువై ఉంటారని, గోపూజ చేయడం వలన సమస్త దేవతలను పూజించిన ఫలితం లభించడమే కాకుండా, పితృ దేవతలకు ఉత్తమ గతులు కలుగుతాయని తెలిపారు. మూడురోజులు ప్రముఖ ధార్మిక ప్రవచకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి.



## ఉత్సాహంగా 'కిలపర్తి' జన్మదిన వేడుకలు

**దేవరాపల్లి, అక్టోబర్ 3, జయ జయహే**

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు జన్మదిన వేడుకలను మండలంలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిపారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల అనంతరం కిలపర్తి భాస్కరరావు జన్మదిన వేడుకలు సందర్భంగా ఎమ్మెల్యే బండారు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, స్థానిక నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రం దేవరాపల్లిలో కిలపర్తి యువసేన ఆధ్వర్యంలో భాస్కరరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు పోతల పాత్రునాయుడు పెద్దాడ వెంకటరమణ, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు, బండారు రామారావు, శరఖాన సూర్యనారాయణ, పూడి సత్యారావు, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, గట్రెడ్డి కొండలరావు, కర్రి దేముళ్లు, పెంటకోట అప్పలనాయుడు, సి ఎ నాయుడు, వనం వెంకటేష్, చిటిమిరెడ్డి నాయుడు, గంధం లక్ష్మి జగన్, చామంతుల వెంకన్న దొర, గుమ్మడి శ్రీరామ్, సోమిరెడ్డి గోవింద, రెడ్డి బలరాం, కొరుపోలు రామలింగ స్వామి, కిల్లి గోవింద, చామంతుల బాలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## డాక్టర్ కె. రాంబాబుకు ఘన సత్కారంగా వైద్యుల ప్రశంసం

**విశాఖపట్నం, అక్టోబర్ 3, జయ జయహే**



రాష్ట్ర అదనపు వైద్య విద్యా సంచాలకులుగా పదోన్నతి పొంది, రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నూతన బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కె. రాంబాబుకు ఆంధ్ర వైద్య కళాశాల సాధారణ వైద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘన సత్కారం నిర్వహించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో నిర్వహించిన ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కె. రాంబాబును శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ తక్కువ వయసులోనే రాష్ట్ర అదనపు వైద్య విద్యా సంచాలకులుగా పదోన్నతి పొంది, రాజమహేంద్రవరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. వైద్య రంగంలో 26 ఏళ్ల సుదీర్ఘ అనుభవం, అంకితభావంతో డాక్టర్ రాంబాబు అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన సేవలు వైద్య విద్యార్థులకు, యువ వైద్యులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి వైద్య రంగానికి మరింత విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. రాంబాబు మాట్లాడుతూ తనకు లభించిన పదోన్నతి తన ఒక్కరి కృషి ఫలితం కాదని, తనను తీర్చిదిద్దిన ఆంధ్ర వైద్య కళాశాల, గురువులు, విద్యార్థులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం ఇందులో ఎంతో ఉందన్నారు. 26 ఏళ్లుగా వైద్యశాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తూ ఎంతో మంది వైద్య విద్యార్థులకు మార్గనిర్దేశం చేసే అవకాశం లభించిందని తెలిపారు. అంటు వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, విమ్స్ సంచాలకుడిగా, రాష్ట్ర కోవిడ్ నియంత్రణ విభాగం నోడల్ అధికారిగా, జీవన్‌దాన్ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఐదేళ్ల పాటు పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను నిర్వహించిన ప్రతి బాధ్యత ఒక కొత్త అనుభవాన్ని, ఒక విలువైన పాఠాన్ని నేర్పిందని చెప్పారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పనిచేసిన అనుభవం జీవితంలో మరచిపోలేనిదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మరో కీలక బాధ్యతను స్వీకరిస్తున్నానని డాక్టర్ రాంబాబు తెలిపారు. గోదావరి జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడంతో పాటు, వైద్య విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, ఆసుపత్రి అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తనపై చూపుతున్న ప్రేమ, అభిమానం, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని కోరారు. అనంతరం రాష్ట్ర కోవిడ్ నియంత్రణ విభాగం నోడల్ అధికారిగా, విమ్స్ సంచాలకుడిగా, జీవన్‌దాన్ రాష్ట్ర ఇన్‌చార్జిగా డాక్టర్ రాంబాబు అందించిన విశిష్ట సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఆయన భవిష్యత్ బాధ్యతల్లోనూ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు, వైద్య రంగానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాధారణ వైద్య విభాగాధిపతి డాక్టర్ సత్యప్రసాద్, మాజీ విభాగాధిపతి డాక్టర్ రాధాకృష్ణన్, మూత్రపిండాల వైద్య విభాగాధిపతి డాక్టర్ జి. ప్రసాద్, పలువురు వైద్యులు, పీజీ విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సిఐ వినోద్ బాబు "పల్లె నిద్ర" కార్యక్రమం

**పాయకరావుపేట, జయ జయహే అక్టోబరు 3**

వెంకటనగరంలో శనివారం రాత్రి సిఐ ఎం వినోద్ బాబు "పల్లె నిద్ర" కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ప్రజా సంబంధాలు, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. గంజాయి నిర్మూలన, మహిళల భద్రత, నేరాల నివారణ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ వంటి పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి త్రాగడం, అక్రమ రవాణా వల్ల కలిగే వ్యక్తిగత, సామాజిక నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, గంజాయి విక్రయాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులకు సహకరించాలని సూచించారు. మహిళల భద్రత, వారికి కల్పించబడిన చట్టపరమైన రక్షణలు, అత్యవసర హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. వేధింపులు, గృహహింస తదితర ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ... శాంతిభద్రతలు, ప్రజా భద్రత, గ్రామంలో ప్రశాంత వాతావరణం పరిరక్షణలో పోలీసులకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జె పురుషోత్తం, తాజా మాజీ సర్పంచ్ వంకా రమణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వంకా శివ, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్

### బాలవరం ఏకలవ్య పాఠశాల విద్యార్థుల విజయం - రాష్ట్ర స్థాయికి ఎంపిక

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 4,**

కొయ్యూరు మండలం బాలవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నుండి విద్యార్థులు క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్ - క్లస్టర్ 1 (2026-2027) లో పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో విజయం సాధించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు కొంతమంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ గారు, పీఈటీ కోటిబాబు గారు, పీఈటీ ఈశ్వరి గారు మరియు మిగతా సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న పనబాక లక్ష్మి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 03, జయ జయహే**

శ్రీకాళహస్తి మాజీ కేంద్ర మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు, తిరుపతి పార్లమెంటరీ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి సభ్యురాలు డా. పనబాక లక్ష్మి శనివారం శ్రీక ళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. పనబాక లక్ష్మి శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. దేవస్థానం అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గణబాబు చెంతకు 'గ్రామకంఠాల' కమిటీ సభ్యులు

### పంచగ్రామాల భూ సమస్యలను పరిష్కరించాలని వినతి

**విశాఖపట్నం, అక్టోబర్ 3, జయ జయహే**

పంచగ్రామాల భూ సమస్యల పరిష్కారంతో పాటు గ్రామకంఠాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అడివివరం ప్రజా రైతు సేవా సంఘం అధ్యక్షుడు సిరిపురపు వరాహ నరసింహం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు శనివారం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణ వెంకటరెడ్డి నాయుడును కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. అనంతరం పంచగ్రామాల భూ సమస్యలకు సంబంధించిన పలు అంశాలను కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పంచగ్రామాల భూ సమస్యల పరిష్కారం కోసం న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులతో పాటు రైతుల నుంచి భూములు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేసిన యజమానుల హక్కులను కూడా పరిరక్షించేలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పంచగ్రామాల్లోని మిగిలిన గ్రామకంఠాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అడివివరంలోని మూడు గ్రామకంఠాలను 22-ఏలోని ఒకటి, సి విభాగంలో చేర్చడం వల్ల గత 30 ఏళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామకంఠాల సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజల హక్కులకు భంగం కలగకుండా పరిష్కారం చూపించాలని కోరారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పంచగ్రామాల భూ సమస్యలకు ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని కమిటీ సభ్యులు కోరారు. గ్రామకంఠాలపై ఉన్న ఆంక్షల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట కలిగేలా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, కర్రి స్వామి, తెలుగుదేశం పార్టీ మాజీ వార్డు అధ్యక్షుడు మేకల కాసు గోపాల్, భోగాపురపు పైడికొండ, జర్రిపోతుల నరసింహమూర్తి, కమిటీ ప్రధాన కార్యదర్శి పంచదార్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు కొలుసు శ్రీనివాసరావు, బోర మోహన్‌రెడ్డి, సిరిపురపు సత్తిబాబు, పాశర్ల తరుణ్ ఆదిత్య, గొగాడ మధుబాబు పాల్గొన్నారు.

## 22-ఏ సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

**జయ జయహే**

కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వ్యవసాయ భూములుగా ఉన్న పట్టా భూములు, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం నాడు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నెంబర్ 48062/ULC/A1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22 ఎ, లో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాలా రుసుము మరియు ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు.

# బొంగరం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

## గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్

### బ్రిడ్జి కోతకు గురవడంతో గోమంగి నుంచే వెనుతిరుగుతున్న బస్సు

### రవాణా సౌకర్యం లేక 5 పంచాయతీల ప్రజల తీవ్ర అవస్థలు

### స్పందించకుంటే ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరిక

**పాడేరు: అక్టోబర్ 03. జయ జయహే.**






పాడేరు నుంచి బొంగరం వరకు నడిచే ప్రభుత్వ ఆర్టీసీ బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మణుగూరు బాబుజీ, బూడిదే మాధవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గోమంగి ఏపీఆర్ ఏపీఆర్ స్కూల్ సమీపంలోని మర్రిపుట్టు బ్రిడ్జి చివర భాగం తీవ్రంగా కోతకు గురైంది. ఈ ప్రమాదకర పరిస్థితి వల్ల బొంగరం వెళ్లాల్సిన బస్సు ప్రతిరోజూ గోమంగి నుంచే వెనుతిరిగిపోతోంది. బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో గిన్నెలకోట, ఇంజేరి, లింగేటి, బొంగరం, కుంతుర్ల గిరిజన పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత వాసులకు జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు వెళ్లాలన్నా, ఆసుపత్రి అత్యవసర సేవలకు, నిత్యావసర సరుకుల రవాణాకైనా ఈ ఒక్క బస్సే ఏకైక ఆధారంఅన్నారు, బ్రిడ్జి దెబ్బతినడంతో ప్రస్తుతం ఆటోలు, జీపులు కూడా తిరగలేని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు.

**ప్రభుత్వ ఉదాసీనతపై ఆగ్రహం:**

ఇంత జరుగుతున్నా, ఇన్ని రోజులైనా ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించకపోవడం దురదృష్టకరమని గిరిజన విద్యార్థి సంఘం నేతలు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. బస్సును తిరిగి బొంగరం గ్రామం వరకు నడిపించి గిరిజనుల రవాణా కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు.,, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోకపోతే, ఐదు పంచాయతీల ప్రజలను విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసనలు, ప్రజా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. వివిధ గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు,

For a pure tomorrow..
జయహే

# అనుమానంతో కిడ్నాప్

(ప్రతాప్)

### ....భర్త జాడ కనిపెట్టిన క్యూ ఆర్ కోడ్

### ... అక్రమ సంబంధం అనుమానంతో కిడ్నాప్, లైంగిక దాడి కేసు

### ... కిడ్నాప్, లైంగిక దాడి ఆరోపణల కేసులో ఆరుగురు అరెస్టు



కేరళలో సంచలనం రేపిన కిడ్నాప్, లైంగిక దాడి ఆరోపణల కేసులో కొత్త వివరాలు వెలుగుచూశాయి. ఎనిమిదేళ్లుగా భర్త అక్రమ సంబంధంపై అనుమానం పెంచుకున్న ఓ మహిళ, అతడు పంపిన హోటల్ క్యూ ఆర్ కోడ్ చెల్లింపును ఆధారంగా చేసుకుని అతని జాడ కనిపెట్టి, అనంతరం జరిగిన పరిణామాలు తీవ్ర కలకలం రేపాయి.

పోలీసుల వివరాల ప్రకారం, తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన ఓ టాక్సీ డ్రైవర్‌కు కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన మహిళతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ కలుస్తుండేవారని, ఈ విషయం డ్రైవర్ భార్యకు చాలాకాలంగా తెలిసి ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. భర్తపై అనుమానంతో ఆమె అతని కదలికలను గమనించడంతో పాటు కొంతకాలంగా నిఘా కూడా పెట్టించినట్లు పోలీసులు చెబుతున్నారు.

సెప్టెంబర్ 22న ఆ టాక్సీ డ్రైవర్, మలప్పురం మహిళతో కలిసి వయనాడ్ పర్యటన ముగించుకుని త్రిస్సూర్‌లోని ఓ హోటల్‌లో బస చేశాడు. అదే సమయంలో అతనికి డబ్బు అవసరం ఏర్పడటంతో భార్యకు ఫోన్ చేసి హోటల్ వ్యాపార ఖాతాకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌ను పంపించాడు. ఆమె యూపీఐ ద్వారా డబ్బు బదిలీ చేసిన అనంతరం భర్త ఉన్న హోటల్‌ను గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు.




ఆ సమాచారం అందుకున్న తరువాత ఆమె తనకు పరిచయమున్న మరో ఐదుగురు టాక్సీ డ్రైవర్లకు సమాచారం ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరంతా దాదాపు 170 కిలోమీటర్ల దూరం ప్రయాణించి త్రిస్సూర్ చేరుకున్నారు.

హోటల్ వద్దకు వెళ్లిన వారు తమను పోలీసులమని పరిచయం చేసుకుని, తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి బంగారం దొంగతనం కేసులో నిందితుడని చెబుతూ హోటల్ సిబ్బందిని నమ్మించినట్లు పోలీసులు వెల్లడించారు.

తర్వాత వారు బాధితులు బస చేస్తున్న గదిలోకి ప్రవేశించి ఇద్దరినీ బలవంతంగా తమ వెంట తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం వారిని తమిళనాడుకు తరలించారు. అక్కడ మలప్పురం జిల్లాకు చెందిన మహిళపై లైంగిక దాడి జరిగినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

అయితే మరుసటి రోజు మరో ప్రాంతానికి తరలిస్తున్న సమయంలో పరిస్థితిని గమనించిన కొందరు స్థానికులకు అనుమానం వచ్చింది. వాహనంలో చిరిగిన దుస్తులతో భయాందోళనల్లో ఉన్న మహిళను చూసిన వారు ప్రశ్నించడం ప్రారంభించడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సహాయంతో బాధితురాలు సమీప రైల్వే స్టేషన్‌కు చేరుకుని కేరళకు తిరిగి వచ్చింది. అనంతరం మలప్పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు త్రిస్సూర్ పోలీసులకు బదిలీ అయింది.

ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న భార్యతో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు వారిని రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. నిందితులపై గతంలో ఎలాంటి నేరచరిత్ర ఉందనే దానిపై కూడా విచారణ కొనసాగుతోంది. డిజిటల్ చెల్లింపు ద్వారా భర్త జాడ కనిపెట్టడం, దాని తరువాత జరిగిన కిడ్నాప్, లైంగిక దాడి ఆరోపణలు దక్షిణ భారత రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# మానసిక ఆరోగ్య వారోత్సవాలు 2026

## అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు.. మొదటి రోజు శీర్షిక




విద్యార్థి దశలో భయాన్ని ఎలా లేకుండా చేయాలి

భయం అనగా అసలు ఏమిటి? భయం ఎందుకు వేస్తుంది? భయం కలిగినప్పుడు ఆందోళన ఎందుకు పుడుతుంది?

వీటన్నిటికీ సమాధానం ఒక్కటే. మన మనసులో పుట్టే ఒక హెచ్చరిక భయం. ఏదైనా ప్రమాదం సంభవిస్తుందేమో అని, ఆపద ఏదైనా జరుగుతుందేమో అని, ఏదైనా తప్పు జరిగితే నలుగురు నవ్వుతారని మన మెదడు మన మనసుకు చెప్పే భావనే ఈ భయాందోళన.

భయం అంటే అంధకారం. ధైర్యం అంటే దీపపు వెలుగు. విద్యార్థి దశలో చాలా రకాలైన భయాలు ఒత్తిళ్లు పిల్లల్లో ఏర్పడుతూ ఉంటాయి.భయాన్ని అధిగమించాలి అంటే ఆత్మవిశ్వాసంతో కూడిన ఆలోచనలు చేయాలి. ఒత్తిడిని దూరం చేసుకోవడం అనే దానికోసం ఎటువంటి విధంగా నడుచుకోవాలి అనేది తెలుసుకొని అడుగులు వేస్తే ఇటువంటి భయాలు ఒత్తిళ్లు దరి చేరవు.

**భయాలు రెండు రకాలు**

1. మంచి భయం

విషపూరితమైన సర్పాలు క్రూర మృగాలని చూసి భయపడటం,రోడ్డు దాటుతుండగా వాహనాలు అతివేగం చూసి భయపడటం విపరీతమైన రద్దీ ఉన్న ప్రదేశాలలో రోడ్డు దాటుతూ విపరీతమైన ఆందోళన చెందుతూ అడుగులు వేయడం ఇవన్నీ సహజ మంచి భయాలు ఇవి ఉండడం సహజం.

2. చెడు భయం

పరీక్ష అన్న భయం,వేదిక పైన ప్రసంగించడం అన్న భయం, ప్రార్థనా స్థలంలో అనగా విద్యార్థి దశలో అసెంబ్లీలో మాట్లాడాలన్నా భయం, ఇతర విషయాలలో ముందుకొచ్చి నిలబడి మాట్లాడాలన్నా పిల్లల్లో చాలా రకాలైన భయాందోళనలు కలుగుతాయి. ఈ భయానికి లోనే ముందుకి అడుగు వేయడానికి ఇష్టపడరు. ఇటువంటి చిన్న చిన్న విషయాల్లో ముందు అడుగులు వేస్తేనే విజయం లభిస్తుంది అని ఆలోచన చేసి ముందడుగు వేయలేనందుకు కూడా భయపడడం జరుగుతున్న విషయం.

పిల్లల్లో ఇలాంటి చిన్న చిన్న భయాలు ఎక్కువైతే తీవ్రమైన ఆలోచన చేసి ఫోబియా గా మార్చుకుని తీవ్ర మనోవేదనకు గురై కుంటనానికి లోనౌతారు

అందుకని వారిలో భయాన్ని పోగొట్టాలి అంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కొంత మానసిక ధైర్యాన్ని ఇవ్వాలి.ఇటువంటి విధంగా విద్యార్థి దశలో భయాలను పోగొడితేనే ఉత్తమ విద్యార్థులుగా ముందుకు సాగుతారు.

**పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ధైర్య సూచనలు**

1. తల్లిదండ్రుల ముఖ్యంగా పిల్లలు ఏదైనా తప్పు చేస్తే వారిని ఎందుకు ఆ తప్పు చేశారని తెలుసుకొని అప్పుడు మందలించే ప్రయత్నం చేయాలి.

2. చిన్న చిన్న ప్రయత్నాలు చేసినప్పుడు వారిని ప్రోత్సహించడం చాలా మంచి అలవాటు.

3. తల్లిదండ్రులు పిల్లలు ఏదైనా చిన్న సహాయం చేసినప్పుడు వారిని శభాష్ అని మెచ్చుకోవాలి. అవకాశం మేరా వారికి ఉపయుక్తమైన చిన్న చిన్న బహుమతులు ఇవ్వాలి.

4. పిల్లలను మరి స్నేహితులతో ఇతర పిల్లలతో పోల్చకూడదు.

5. తల్లిదండ్రులు పిల్లల భయపడుతుంటే వారికి మనోధైర్యాన్ని పెంచే నీతి కథలు చిన్న చిన్న పదాలతో ఏర్పడిన మంచి వ్యక్తుల మాటలు వినిపించాలి.

6. మానసికంగా సంతోషాన్ని పిల్లలకు ఇవ్వాలి అంటే పిల్లలతో మమేకమై చిన్న చిన్న ఆటలు తల్లి లేదా తండ్రి సమయాన్ని వెచ్చించి ఆడుకోవాలి.

7. ప్రతి విషయాన్ని నిలదీసి అడగకుండా ఆలోచన చేసి అడిగి తెలుసుకోవడం నిదానంగా జవాబు రాబట్టడం ఉత్తమ ప్రక్రియ.

8. అప్పుడప్పుడు పిల్లలకు కావలసిన తగిన స్వేచ్ఛను ఇస్తూ ఉండాలి.

**పిల్లలకు ఉపాధ్యాయులు ఇచ్చే ధైర్య సూచనలు**

1. ఉపాధ్యాయులు నిరంతరం తల్లిదండ్రులకి అన్ని చెప్పమని తెలియపరచాలి.

2. విద్యార్థులకు సరైన పాఠ్యాంశాలతో పాటు నడవడికకు కావలసిన సరైన నైతిక విలువలను ప్రతి రోజు తరగతి గదిలో కచ్చితంగా బోధించాలి.

3. స్టేజ్ ఫియర్ ఫోబియా పోగొట్టడానికి మొదటిగా తరగతి గదిలో బోర్డు ముందు నిలబెట్టించి మాట్లాడటం,తర్వాత అసెంబ్లీ ప్రార్థన స్థలంలో నిలబెట్టి మాట్లాడటం,దాని తర్వాత వేదిక పైన మాట్లాడించేలాగా ప్రోత్సహిస్తూ ఉండాలి.

4. విద్యార్థులను తిట్టకుండా వెన్ను తట్టి ప్రోత్సహించాలి.

5. పరీక్ష అనగా నీవు ఎంత నేర్చుకున్నావో తెలిపే ఒక చిన్న పండుగ అని చెప్పాలి.

6. ప్రతిసారి విద్యార్థి చెప్పే విషయాలను విసుక్కోకుండా ఉపాధ్యాయులు శ్రద్ధగా విని దానికి తగిన పరిష్కార మార్గాన్ని చూపాలి.

7. ఉపాధ్యాయులు అనగా స్నేహపూరిత వాతావరణాన్ని అప్పుడప్పుడు పిల్లలకు అందజేస్తే భయభ్రాంతులకు గురయ్యే సమయాన్ని తగ్గించినవారు అవుతారు.

8. విద్యార్థి తరగతి గదిలో అడిగిన ప్రశ్నకు తప్పు జవాబు చెప్తే తిట్టకుండా కొట్టకుండా జవాబు చెప్పే ప్రయత్నం చేసినందుకు ప్రశంసించి పొగడ్తల వర్షం కురిపించాలి.

9. విద్యార్థి చేసే చిన్న సహాయానికి తరగతి గదిలో శభాష్ అని తోటి విద్యార్థుల చేత హర్షధ్వానాలు అనగా చప్పట్లు కొట్టిస్తే విద్యార్థి యొక్క ఆనందానికి అవధులు ఉండవు.

10. విద్యార్థులకి తరగతి గదిలో పాఠ్యాంశం తర్వాత స్నేహబంధం తో ఉంటే ఎటువంటి విషయాలైనా పరిష్కారం చేసుకోవచ్చు అని తెలిపే కథల్ని వివరించి చెప్పాలి.

రచన
ఏ బాల సౌజన్య కుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
అధ్యాత్మిక వేత్త,
ప్రవచనకర్త



## క్రీడలు, సైన్సులో కొయ్యూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సత్తా..

### 70వ పాఠశాల క్రీడలకు 28 మంది ఎంపిక - సైన్స్ సదస్సులో దేశ్వంత్ ప్రతిభ..

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్ )అక్టోబర్ 04,**

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వసతి గృహ బాలుర పాఠశాల, కొయ్యూరు విద్యార్థులు క్రీడలు, సైన్స్ విభాగాల్లో ప్రతిభ చాటుకుని పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం శనివారం వివరాలను వెల్లడించింది.ఈ నెల 1న నిర్వహించిన 70వ రాష్ట్ర స్థాయి పాఠశాల ఆటల సమాఖ్య క్రీడా ఎంపికల్లో కొయ్యూరు పాఠశాలకు చెందిన మొత్తం 28 మంది విద్యార్థులు తదుపరి స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.17 ఏళ్లలోపు బాలుర విభాగంలో - వాలీబాల్ లో 6 మంది, కబడ్డీలో 6 మంది, ఖో-ఖోలో 2 మంది, షటిల్ లో 2 మంది.14 ఏళ్లలోపు విభాగంలో - వాలీబాల్ లో 2, ఖో-ఖోలో 2, కబడ్డీలో 6, షటిల్ లో 2 మంది చొప్పున ఎంపికయ్యారు.అదేవిధంగా సెప్టెంబర్ 30న విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించిన “భారత ఇంధన వనరులు-2047” రాష్ట్ర స్థాయి జాతీయ సైన్స్ సదస్సులో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జి. దేశ్వంత్ పాల్గొని ప్రతిభ కనబరిచాడు.క్రీడల్లో తదుపరి స్థాయి పోటీలకు ఎంపికైన 28 మంది విద్యార్థులతో పాటు సైన్స్ సదస్సులో ప్రతిభ చూపిన దేశ్వంత్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉప ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పి. రవి, పి.డి.కె. శివాజీ అభినందించారు.




## నిడదవోలు డీఎస్ఓ స్కూల్‌లో శక్తి టీమ్ అవగాహన సదస్సు...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

విద్యార్థులు, బాలికల భద్రతపై అవగాహన కల్పించేందుకు నిడదవోలు డీఎస్ఓ స్కూల్‌లో శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నిడదవోలు ఎస్ఐ జగన్ ఆధ్వర్యంలో శక్తి టీమ్ ఏఎస్ఐ జీఆర్‌కే గంగాధరరావు, డబ్ల్యూపీసీ ఎన్. శాంతి పాల్గొని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.స్కూల్ హెచ్ఎం భీమారావు, ఉపాధ్యాయులు శాంతరాజు, చిట్టితల్లి, హేమ, రత్నకుమారి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు కె. రెహానా రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ ఎమర్జెన్సీ నంబర్ 112, శక్తి మహిళా, శిశు భద్రత యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, దాని వినియోగం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అలాగే పోక్సో చట్టం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ పద్ధతుల గురించి వివరించారు.సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, గుర్తుతెలియని యాప్స్, నకిలీ ఏపీకే ఫైల్స్, అనుమానాస్పద లింకులు, ఆధార్ వివరాలు, ఓటీపీని ఇతరులకు చెప్పడం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ డీపీ ద్వారా కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా గుర్తుతెలియని వ్యక్తుల కార్లు, బైకుల్లో ఎక్కడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




## వాడపల్లికి ఉచిత బస్సు.. మహిళలకు ఊరట!

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 4:**

కడియపులంక శ్రీ ముసలమ్మ అమ్మవారి ఆలయం నుంచి వాడపల్లి శ్రీవారి దర్శనానికి వెళ్లే మహిళల సౌకర్యార్థం ప్రత్యేక ఉచిత బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. గౌతమి నర్సరీ అధినేత మార్గాని వీరబాబు విజ్ఞప్తి మేరకు ఎపిఎస్ఆర్టీసీ ఏర్పాటు చేసిన ఈ సర్వీసును ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు గట్టి నరసయ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ, వాడపల్లి శ్రీవారి దర్శనానికి వెళ్లే మహిళలకు రవాణా ఇబ్బందులు లేకుండా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. మహిళల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎపిఎస్ఆర్టీసి ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసి ఎస్ఎస్ కుమార్, ఆర్ఎంఈ వెంకటేశ్వరరావు, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు బొరుసు సుబ్బారాయుడు, మండల ఉపాధ్యక్షులు పంతం గణపతి, బిజెపి మండల అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం, సొసైటీ మాజీ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాస్, మార్గాని ఏడుకొండలు, నక్కా కాశి, అమ్మిరాజు సోదరులు, పెద్దిరెడ్డి శ్రీనివాసు, మల్లు కొండయ్య, ఈలి బేబి , గంగారావు, పుల్లా శ్రీనివాస్, రామన్న, పుల్లా చిన్న సత్యనారాయణ, పెద్ద సత్యనారాయణ, కర్రి యస్సయ్య, ఆకుల వెంకన్న తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com